
సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం । 17 । మార్చి । 2025



ఆటంకంగా నీటి ఊట

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలకు నీటి ఊట ఆటంకం మారుతోంది.

వివరాలు 8లో ►

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (సోమవారం సాయంత్రం)

సహర్ 5-00 (మంగళవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.2/16.6

ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

మిల్లుల్లో దొంగలు పడ్డారు

నడిగడ్డలో వరుస బియ్యం అపహరణలతో విస్మయం

- అమ్ముకున్నారా.. అపహరించారా.. అన్న అనుమానాలు
- తాజాగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- పోలీసుల అదుపులో నిందితులు?

గద్వాల క్రైం: తాళం వేసిన ఇళ్లు, దుకాణాలు, బ్యాంకుల్లో దొంగలు పడడం వింటుంటాం. కానీ, నడిగడ్డలో ఏకంగా రైస్‌మిల్లుల్లో దొంగలు పడుతున్నారు. వందలాది ధాన్యం, బియ్యం బస్తాలను ఎత్తుకుపోతున్నారు. 50 నుంచి 75 కేజీల వరకు బరువు ఉండే వందలాది బియ్యం, ధాన్యం బస్తాలను గుర్తు తెలియని దుండగులు అపహరించడం.. అందులోను మొత్తానికి మొత్తం సీఎంఆర్ (మర ఆడించేందుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం) ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజాగా గద్వాల మండల పరిధిలోని ఓ రైస్ మిల్లులో దొంగలు చొరబడి వరిధాన్యం, బియ్యం, నూకలు అపహరించారని యాజమాని రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం చర్చనీయాంశమైంది. గత ఏడాది ఎర్రవల్లి మండలంలోని ఓ రైస్ మిల్లులో సీఎమ్మార్ బస్తాలు అపహరణకు గురయ్యాయి. ఇదంతా నిజంగా దొంగల పనా.. లేక ఇంటి దొంగల పనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరుస సంఘటనలు యాజమానుల గారడీయే అని పలువురు ఆరోపిస్తున్నారు. మిల్లు యజమాని ఫిర్యాదుతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.

పోలీసుల అదుపులో నిందితులు

ఇదిలాఉండగా, మొదటి కేసులో పోలీసులు విచారణలో ఆరుగురు నిందితులను గుర్తించారు. ఏ1 లారీ డ్రైవర్ కావడం తరచూ గోదాంకు వరిధాన్యంను అన్‌లోడు చేసే క్రమంలో తెలిసిన కూలీల ద్వారా దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే తాజాగా రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులోను మిల్లులో పని చేసే వ్యక్తులే దొంగతనం చేసినట్లు తెలుస్తోంది. ఈమేరకు శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులోని రైస్ మిల్లులో వరిధాన్యం, బియ్యం, నూకలు అపహరించిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఎంత మొత్తంలో చోరీకి పాల్పడి వాటిని ఎక్కడికి తరలించారు, ఎంత విక్రయించారనే వివరాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే ఇక్కడే కొన్ని చిక్కు ముడులున్నాయి. ప్రభుత్వం కేటాయించిన సీఎమ్మార్‌ను మిల్లర్లు బ్లాక్ మార్కెట్‌లో గుట్టుగా విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కేటాయించిన వరిధాన్యాన్ని మర ఆడించి బియ్యంగా చేసి అందజేయాల్సి ఉండగా వాటి నుంచి తప్పించుకునేందుకే ఈ చోరీల అంశాన్ని సాకుగా చూపిస్తున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



బీచుపల్లి గోదాంలో ధాన్యం చోరీ కాగా.. పరిశీలిస్తున్న సీఐ రవిబాబు (ఫైల్)

జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు

⇨ 25.12.2024 తేదీన హరినాథ్ రైస్ మిల్లు వ్యాపారికి సంబంధించి ఎర్రవల్లి మండలం బీచుపల్లి వద్ద ఓ గోదాంలో ప్రభుత్వం కేటాయించిన 1,50,000 బస్తాల సీఎమ్మార్‌ను కేటాయించగా అట్టి ధాన్యాన్ని గోదాంలో నిల్వ ఉంచారు. అయితే దుండగులు గోదాం షెట్టర్‌ను ధ్వంసం చేసి రూ.3.50లక్షల విలువ గల 300 బస్తాలు వరిధాన్యాన్ని అపహరించినట్లు ఇటిక్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు.

⇨ 8.03.2025 తేదీన అశోక్‌కుమార్ రైస్ మిల్లు వ్యాపారి గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులో రైస్ మిల్లును ఏర్పాటు చేసుకుని వరిధాన్యం మర ఆడిస్తున్నాడు. ఈ క్రమంలో మిల్లులో వరిధాన్యం, బియ్యం, నూకల బస్తాలను మిల్లులో పని చేసే వ్యక్తులు అపహరించారని అనుమానం వ్యక్తం చేస్తు ఫిర్యాదు చేశాడు. అపహరించిన వరిధాన్యం, బియ్యం, నూకల విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

విచారణ దశలో ఉంది



రైస్ మిల్లులో వరిధాన్యం, బియ్యం, నూకలను అపహరించిన ఘటనపై కొందరిని అదుపులోకి తీసుకున్నాం. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. అయితే ఇది ప్రభుత్వం కేటాయించిన సీఎమ్మారా.. లేక ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన బియ్యమా అనేది తేలాల్సి ఉంది. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం. సివిల్‌సప్‌లై శాఖ అధికారుల నివేదికాల ఆధారంగా విచారణ చేపడతాం.

– శ్రీకాంత్, ఎస్‌ఐ, గద్వాల రూరల్



2023లో సీఎమ్మార్ అక్రమాలపై గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిల్లర్లపై ఫిర్యాదు చేస్తున్న సివిల్‌సప్లై అధికారులు

జిల్లాలోని గద్వాల, అలంపూర్, అయిజ పరిధిలో 37 రైస్ మిల్లులు ఉన్నాయి. అయితే ప్రభుత్వం సీఎమ్మార్‌ను 2024 – 2025 ఖరీఫ్ సీజన్‌కుగాను 85,483 మెట్రిక్ టన్నులు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు మిల్లర్లు 31,481.696 మెట్రిక్ టన్నుల బియ్యంను (9.84 శాతం) మాత్రమే ప్రభుత్వానికి అప్పగించినట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. ఇక అశోక్‌కుమార్ రైస్ మిల్లుకు ప్రభుత్వం 1470.120 మెట్రిక్ టన్నులకుగాను ఇప్పటివరకు 40 శాతం మేర సరఫర చేసినట్లు సమాచారం.

అనుమానాలెన్నో..?

ఖరీఫ్ గడువులోగా మొత్తం మర ఆడించిన బియ్యాన్ని అందజేయాల్సిన తరుణంలో చోరీ సంఘటన వెలుగులోకి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదులో రూ.2లక్షల విలువగా పేర్కొనగా.. నిందితులపై రూ.కోటిపైగా విలువ గల వరిధాన్యం, బియ్యం, నూకలను అపహరించినట్లు అభియోగం మోపినట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అయ్యాయి. అయితే, 2023 సంవత్సరంలో గద్వాల, శాంతినగర్, అయిజ పోలీసు స్టేషన్‌లోని మూడు మిల్లులపై సైతం కేసులు నమోదయ్యాయి. అయితే ఆర్థిక బలం, నాయకుల మద్దతు ఉండడమే రైస్ మిల్లు వ్యాపారులకు కలిసి వస్తుంది. సివిల్ సప్‌లై శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా లేకపోవడం వ్యాపారులను నిలువరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికారులు, వ్యాపారుల అవినీతిపై ఇప్పటికే రాష్ట్ర ఎన్‌ఫోర్స్ మెంట్, ఇంటెలిజెన్సీ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు.

ఐదెకరాల భూమికి టెండర్

నకిలీ వారసుడి నిర్వాకం

- కళ్లు మూసుకుని ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులు
- అసలు వారసుడి రంగప్రవేశంతో ఆగిన భూ బదలాయింపు
- ఇందువాసి శివారులోని భూమికి ఎసరు



గట్టు: మొన్నటికి మొన్న.. గట్టుకు చెందిన ఓ వ్యవసాయ భూమి యజమాని 2016లో చనిపోతే ఆ వ్యక్తి ఆధార్‌ను మరో వ్యక్తి లింకు చేసుకొని 2021లో గట్టు రెవెన్యూ ఆఫీసులో దర్జాగా భూ బదలాయింపు చేశారు. దాయాది కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో ఈ వ్యవహారం బయట పడింది. నిన్నేమో.. ఆలూరులో ఒక కులానికి చెందిన వ్యక్తి చనిపోతే మరో కులానికి చెందిన వ్యక్తి ఆ భూమికి తామే వారసులమని వారసత్వం భూమిని బదలాయించగా తమ పనితనాన్ని చాటుకొని ఔరా అనిపించుకున్నారు. ఇక తాజా విషయానికి వస్తే.. వారసులు కాని వారసులు గట్టు రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొని ఇందువాసి శివారులోని 5-18 ఎకరాల భూమికి టెండర్ పెట్టారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. మొత్తంగా గట్టు రెవెన్యూ అధికారులు ఏం చేసినా అడిగే దిక్కెవరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే ఉన్నతాధికారులు కూడా ఇవేం పెద్ద నేరాలు కాదన్నట్లుగా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో వీరి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని సామాన్యులు ఆరోపిస్తున్నారు.

తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో..

ఇటీవల ఇందువాసి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 385/బీ/1లోని 5-18 ఎకరాల భూమికి అసలు వారసులు కాకుండా నకిలీ వారసులు ముందుకు వచ్చి భూమిని కాజేసే ప్రయత్నం చేశారు. వారం రోజుల క్రితం అక్రమ భూ బదలాయింపు వ్యవహారంపై అసలు వారసులు గట్టు రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని ఘర్షణకు దిగి, పోలీస్ స్టేషన్ దాకా పంచాయితీ వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. ఇందువాసి గ్రామానికి చెందిన ముత్తయ్య తండ్రి ఇంజన్నకు గ్రామ శివారులోని సర్వే నెంబర్ 358/బీ/1లో 5-18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ముత్తయ్య ప్రకాష్, గొర్లన్న అనే ఇద్దరు కుమారులతో పాటుగా ముగ్గురు కుమార్తెలున్నారు. అయితే సదరు భూ యజమానితో పాటుగా కుటుంబ సభ్యులు ఉపాధి నిమిత్తం శాంతినగర్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. భూ యజమాని చనిపోయిన విషయం తెలుసుకున్న దాయాది అయిన విజయ్ తండ్రి ఇంజన్న అనే వ్యక్తి చనిపోయిన ముత్తయ్య తన తండ్రి కాకపోయినప్పటికి తన తండ్రే అని రెవెన్యూ అధికారులను నమ్మించాడు. ముత్తయ్య ఆధార్ లింకును తన తండ్రి ఇంజన్న ఆధార్‌కు లింకు చేయించుకున్నాడు. తన తండ్రి ఇంజన్న, తల్లి సుశీలమ్మ బతికుండగానే చనిపోయినట్లుగా నమ్మించి, గత ఏడాది నవంబర్‌లో తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను తీసుకున్నాడు. ఈ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా గత ఏడాది నవంబర్‌లో గట్టు తహసీల్దార్ కార్యాలయంలో వారసత్వంగా భూ బదలాయింపునకు ప్రయత్నించాడు. విషయం కాస్త శాంతినగర్‌లో ఉండే అసలు వారసుడికి తెలియడంతో గట్టు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి, భూ బదలాయింపును అడ్డుకొని వాగ్వానికి దిగారు. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ల తర్వాత తహసీల్దార్ మారిపోవడంతో నకిలీ వారసుడు మళ్లీ రెవెన్యూ అధికారుల దగ్గర భూ బదలాయింపునకు ప్రయత్నించగా, అసలు వారసులు రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ అధికారుల ఎదుటే ఘర్షణకు దిగారు. రెవెన్యూ అధికారులు అసలు విషయం తెలుసుకుని భూ బదలాయింపును నిలిపి వేసినట్లు తెలిసింది.



గట్టు రెవెన్యూ అధికారులు జారీ చేసిన తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



ముత్తయ్య పేరున ఉన్న అసలు పట్టాదారుని పాసుపుస్తకం



ముత్తయ్య మరణ ధ్రువీకరణ పత్రం

తహసీల్దార్ ఏమంటున్నారంటే..

ఇందువాసి భూ బదలాయింపు వ్యవహారం తన దృష్టికి వచ్చినట్లు తహసీల్దార్ సలిముద్దీన్ తెలిపారు. తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకున్నట్లు తన దృష్టికి రావడంతో రిజిస్ట్రేషన్‌ను నిలిపి వేశాం. గతంలో జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాల్సిందిగా ఆర్డీఓకు సిఫారస్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

న్యూస్‌రీల్

చంద్రగఢ్ కోట అభివృద్ధికి కృషి



అమరచింత: చంద్రగఢ్ కోట చరిత్రను అధ్యయనం చేసి పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ప్రాచీన చంద్రగఢ్ కోటను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సందర్శించారు. కోట లోపల ఉన్న రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాతి కొలనులు, కోటను పరిశీలించి మాట్లాడారు. కోట, ఆలయ ప్రాచుర్యం, చరిత్రను వెలికి తీసేందుకు కృషి చేస్తామని.. కోట వద్ద మౌలిక సౌకర్యాల కల్పనకు ముందస్తుగా రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఈ నిధులతో కోటపై భాగానికి వెళ్లడానికి సీసీ రహదారి నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సమీపంలోనే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉందని.. అక్కడి పర్యాటకులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి కోటను చూడటానికి వస్తుంటారని, పర్యాటక కేంద్రంగా గుర్తించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి పురావస్తుశాఖ అధికారులను పంపించి చరిత్రను గుర్తించి కోట అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, డీసీసీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేశాకే పనులు చేపట్టాలి

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేశాకే రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా ఆదివారం ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలన్నారు. ఉదండాపూర్‌లో రీసర్వేకు సంపూర్ణంగా సహకరించామని, తమకు పూర్తిస్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పెంచి అందించాలని కోరారు. అలాగే 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంతర్ జిల్లాల దారిలో.. అవస్థల ప్రయాణం

మహబూబ్‌నగర్- శ్రీశైలం, పెబ్బేరు- జడ్చర్ల మధ్య పెరిగిన రాకపోకలు



మహబూబ్‌నగర్- శ్రీశైలం అంతర్రాష్ట్ర రహదారి ఇలా..

- వాహనాల రద్దీకి అనుగుణంగా లేని రోడ్డు సౌకర్యం
- ప్రతిపాదనలకే పరిమితమైన జాతీయ రహదారి డిమాండ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అచ్చంపేట: అంతర్ జిల్లాల రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఒకవైపు గుంతలు, మరోవైపు ప్రమాదకర మలుపులతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వాహనాల రద్దీకి అనుగుణంగా అంతర్ జిల్లాల రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించాలనే ప్రతిపాదనలు మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రధాన పట్టణాలు, పుణ్యక్షేత్రాలు వెళ్లేందుకు రెండు వరుసల రహదారులే దిక్కవుతున్నాయి. ఫలితంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం..

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి బిజినేపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం మీదుగా అచ్చంపేట, మన్ననూర్ వరకు.. పెబ్బేరు నుంచి వనపర్తి జిల్లాకేంద్రం, బిజినేపల్లి మీదుగా జడ్చర్ల వరకు రెండు వరుసల రహదారులు ఉన్నాయి. వీటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉండగా.. కార్యరూపం దాల్చడం లేదు. మరోవైపు అలంపూర్ చౌరస్తా నుంచి డిండి, నల్లగొండ వరకు మరో జాతీయ రహదారి కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌తోపాటు గద్వాల, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల ప్రజలు శ్రీశైలం- హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రోడ్డుపై ప్రయాణించాలి. ఉమ్మడి జిల్లావాసులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రెండు వరుసల రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కనీస వేగంతో ఈ రోడ్డుపై ప్రయాణించడం కష్టతరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే అంతర్ జిల్లాల రోడ్డును జాతీయ రహదారిగా మారిస్తే ప్రయాణికులు, వాహనదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

వీటితో అనుసంధానిస్తే..

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్‌హెచ్-44, 167, 765 ఉన్నాయి. వీటికి అదనంగా భూత్పూర్ నుంచి మహబూబ్‌నగర్ మీదుగా చించోలి వరకు ఎన్‌హెచ్-167ఎన్, కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఎన్‌హెచ్-167కే, కర్నూలు నుంచి షోలాపూర్ వరకు ఎన్‌హెచ్-150సీ జాతీయ రహదారుల పనులు కొనసాగుతున్నాయి. అలాగే భూత్పూర్ నుంచి ఎన్‌హెచ్-44, చించోలి 167-ఎన్ రహదారులను అనుసంధానిస్తూ.. మన్ననూర్ (శ్రీశైలం ఎన్‌హెచ్-765) వరకు 104 కి.మీ., రోడ్డును పొడిగించాలనే డిమాండ్ ఉంది. పెబ్బేరు ఎన్‌హెచ్- 44 నుంచి వనపర్తి, బిజినేపల్లి మీదుగా జడ్చర్ల ఎన్‌హెచ్-167 వరకు 74 కి.మీ., పుల్లూరు ఎన్‌హెచ్-44 నుంచి అలంపూర్, పెంట్లవెల్లి, కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట మీదుగా డిండి ఎన్‌హెచ్-765 వరకు, వనపర్తి నుంచి కొత్తకోట మీదుగా మంత్రాలయం వరకు 110 కి.మీ., ఎర్రవల్లి ఎన్‌హెచ్-44 నుంచి గద్వాల మీదుగా రాయచూర్ వరకు 67 కి.మీ., మరికల్ నుంచి నారాయణపేట మీదుగా రామసముద్రం ఎన్‌హెచ్-150 వరకు 63 కి.మీ., రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి జాతీయ రహదారులుగా మారితే ఆయా గ్రామాలు, పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టిసారిస్తే జాతీయ రహదారుల దిశగా అడుగులు పడే అవకాశం ఉంది.

కేంద్రానికి ప్రతిపాదించాం..



స్టేట్ హైవేలను జాతీయ రహదారులుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అందులో ప్రధానంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నాలుగు రోడ్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్లగా ప్రతిపాదనల్లో ఉన్న రహదారుల మంజూరు కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర మంత్రులను కలిసి రోడ్ల ఆవశ్యకతను వివరించాం. వీటికి త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

– మల్లు రవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

పుణ్యక్షేత్రాలను కలుపుతూ..

గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఉమ్మడి జిల్లా ఎంతో ప్రగతి సాధించింది. అంతర్ జిల్లాల రోడ్లు జాతీయ రహదారులుగా మారితే పర్యాటకంగా, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రజల రాకపోకలు, సరుకుల రవాణాకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందినవారు శ్రీశైలానికి రావాలంటే మహబూబ్‌నగర్-అచ్చంపేట రోడ్డే దిక్కు. శ్రీశైలం, మద్దిమడుగు ఆంజనేయస్వామి, ఉమామహేశ్వర క్షేత్రం, మల్లెలతీర్థం, లొద్దిమల్లయ్య, సలేశ్వరం పుణ్యక్షేత్రాలు, పర్యాటకంగా విరాజిల్లుతున్న నల్లమల ప్రాంతానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఇలా రాకపోకలు సాగించే వాహనాలకు మహబూబ్‌నగర్-అచ్చంపేట, పెబ్బేరు- జడ్చర్ల మధ్య ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు మార్గాల్లో రోడ్ల సామర్థ్యానికి మించి వాహనాలు నడుస్తున్నాయి. ఫలితంగా వాహనాలు తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తుండటంతో కొద్ది దూరానికే ఎక్కువ సమయం గడిచిపోతోంది. వీటిని జాతీయ రహదారులుగా మార్చాల్సిన అవసరం ఉంది.

మైనార్టీ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలు



మహబూబ్‌నగర్‌లోని మైనార్టీ బాలికల- 2 ఒకేషనల్ కళాశాలలో సీజీటీ కోర్సులో ప్రాక్టికల్ నేర్చుకుంటున్న బాలికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గురుకులాలు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 20 మైనార్టీ గురుకుల కళాశాలలు కొనసాగుతుండగా.. వీటిలో 10 బాలుర, 10 బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో విద్యార్థులు ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యనభ్యసిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. కాగా.. మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025- 26 ప్రవేశాల కోసం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని 20 మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. వీటిలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెండు ఒకేషనల్ మైనార్టీ బాలికల- 2 గురుకుల జూనియర్ కళాశాల (అడ్వాన్స్ అండ్ టాక్సేషన్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ), బాలుర- 3 జూనియర్ కళాశాలలో (ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్) 80 సీట్లు, మిగతా 18 జనరల్ మైనార్టీ గురుకుల కళాశాలల్లో చెరో 80 సీట్లు ఉన్నాయి.

రిజర్వేషన్ల ప్రకారం..

ఒక్కో మైనార్టీ గురుకుల కళాశాలల్లో ఒక్కో గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున రెండు గ్రూప్‌ల్లో 80 సీట్లు ఉంటాయి. మైనార్టీలకు 75 శాతం రిజర్వేషన్ల ప్రకారం 30, (ముస్లింలకు 26, క్రిస్టియన్లు 2, జైన్స్, పార్సిస్, బుద్దిస్ట్, సిక్‌లకు 2 సీట్లు), ఇతరులకు 25 శాతం రిజర్వేషన్ల ప్రకారం 10 సీట్లు కేటాయిస్తారు.

ఉమ్మడి జిల్లాలో మైనార్టీ గురుకుల కళాశాలలు, సీట్లు ఇలా..

జిల్లా	బాలురు	బాలికలు	సీట్లు
మహబూబ్‌నగర్	6	4	800
నాగర్‌కర్నూల్	2	2	320
వనపర్తి	1	1	160
నారాయణపేట	1	1	160
గద్వాల	-	2	160

నాణ్యమైన విద్య..



మైనార్టీ గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి సౌకర్యాలు అందిస్తున్నాం. విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రవేశాలకు సంబంధించి మిగతా సమాచారాన్ని సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలి.

– ఖాజా బాహుద్దీన్, ఆర్ఎల్‌సీ, మహబూబ్‌నగర్

ప్రేమించి పెళ్లి చేసుకున్న 45 రోజులకే..

ఉరేసుకుని నవవధువు ఆత్మహత్య


చర్రిత(ఫైల్)

జడ్చర్ల: మండలంలోని రాళ్లగడ్డ తండాలో ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలన్నర రోజులకే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. గొల్లపల్లి శివారులోని రాళ్లగడ్డ తండాకు చెందిన పవన్‌కుమార్, ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన చర్రిత (23) ఖమ్మంలో బీఫార్మసీ చదువుతున్న సమయంలో ప్రేమలో పడ్డారు. 45 రోజుల క్రితం ఆమె తన తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది. భార్యాభర్తలు ప్రస్తుతం రాళ్లగడ్డ తండాలో ఉంటున్నారు. ఆదివారం భర్త పవన్‌కుమార్ డ్యూటీకి వెళ్లి వచ్చి తండాలోని స్నేహితులతో మాట్లాడుతున్న సమయంలో చర్రిత ఇంట్లో ఒంటరిగా ఉంది. కొద్ది సేపటికే ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలు ఎంఫార్మసీ పరీక్షలకు హాజరవుతుందని.. భర్త, ఇతర కుటుంబ సభ్యులతో అన్యూన్యంగా ఉంటున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడటానికి కారణాలు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటంకంగా మారిన నీటి ఊట


సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిని తీసుకెళ్తున్న రెస్క్యూ సిబ్బంది

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 23 రోజులైనా లభించని ఏడుగురి ఆచూకీ

అచ్చంపేట/మన్ననూర్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఉబికి వస్తున్న నీటి ఊటతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. నీటి ఊట వల్ల తవ్వేకొద్దీ బురద, మట్టి వస్తోంది. భారీగా వస్తున్న నీటి ఊటను మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు బయటికి పంపింగ్ చేస్తున్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన ఏడుగురిని బయటికి తెచ్చేందుకు సహాయక బృందాలు 23 రోజులుగా శ్రమిస్తూనే ఉన్నాయి. కాడవర్ డాగ్స్ గుర్తించిన డీ1, డీ2 ప్రదేశాల్లో బిగుసుకుపోయిన బురద తొలగింపు ముమ్మరంగా సాగుతోంది. సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ఆర్మీ, ర్యాట్ హోల్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన 12 బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. తవ్వకాల్లో అడుగడుగునా టీబీఎం పైకప్పు మెటల్ ప్లాట్‌ఫాం, పెద్దపెద్ద ఇనుపరాండ్లు అడ్డుగా వస్తున్నాయి. చిన్నచిన్న వాటిని ఎప్పటికప్పుడు ప్లాస్మా కట్టర్‌తో కట్‌చేసి తొలగిస్తున్నారు. పెద్ద రాండ్లను కట్ చేయడం కొంత ఇబ్బందిగా ఉన్నట్లు సహాయక సిబ్బంది చెబుతున్నారు. రెండు జనరేటర్స్ సహాయంతో మట్టి, బురదను కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి పంపిస్తున్నారు. సొరంగంలో అప్పుడప్పుడు వస్తున్న దుర్వాసనతో సహాయక చర్యలకు కొంత ఇబ్బంది కలుగుతున్నట్లు తెలిసింది.

అందుబాటులోకి రాని రోబో సేవలు..

సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు ఐదు రోజుల క్రితం ఇక్కడికి చేరిన అటానమస్ పవర్డ్ హైడ్రాలిక్ రోబో సేవలు ఇంకా మొదలు కాలేదు. సొరంగం ఇన్‌లెట్ వద్ద నుంచే ఆపరేటింగ్(కమ్యూనికేషన్) చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత మాస్టర్ రోబోతో పాటు పవర్డ్ హైడ్రాలిక్ రోబోకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన 30 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకు ఇన్‌స్టాలేషన్ పూర్తయినా ఆదివారం సాయంత్రం కూడా సొరంగం లోపలికి వెళ్లలేదు. సొరంగంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా హైడ్రాలిక్ రోబోకు ఆటంకం కలిగే అవకాశం ఉండటంతో జాప్యం జరుగుతోంది. ఇది నిరంతరాయం పనిచేసేందుకు అదనపు యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

టీబీఎం శకలాలతో..

పూర్తిగా ఉక్కుతో తయారైన పవర్డ్ హైడ్రాలిక్ రోబో హైడ్రాలిక్ వ్యవస్థతో పనిచేస్తోంది. రోబో ముందు భాగంలో ఉన్న గ్రైండర్ సహాయంతో పెద్దపెద్ద రాళ్లు, రప్పలు, శిథిలాలను ముక్కలుగా చేయడంతో పాటు బురదను వాక్యూమ్ పంపు సహాయంతో నేరుగా కన్వేయర్ బెల్టుపై వేస్తోంది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను సొరంగం లోపల 200 మీటర్ల దూరం నుంచి పర్యవేక్షించేందుకు వీలుంటుంది. అయితే సొరంగంలో రాళ్లు, బురదతో పాటు టీబీఎం విడి భాగాలు ఉండటం వల్ల రోబోలకు కూడా సహాయక సిబ్బందికి ఎదురవుతున్న సమస్యే నెలకొంది. టీబీఎం శకలాలు పూర్తిగా తొలగిస్తే తప్ప రోబో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

సహాయక చర్యలు వేగవంతం..

కార్మికుల ఆవశేషాలు ఉన్నట్లు గుర్తించిన డీ1, డీ2 ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సహాయక చర్యల పురోగతిపై ఆయా బృందాల ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సహాయక బృందాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు, సామగ్రిని అందిస్తున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడంతో పాటు దేశంలోని అన్ని సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని చెప్పారు. సహాయక బృందాలు సమన్వయంతో పనిచేసేందుకు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నామన్నారు. అనంతరం దోమలపెంట జెడ్పీహెచ్ఎస్, యూపీఎస్, స్పోర్ట్స్ క్లబ్, ఈగలపెంట జిమ్ సెంటర్, కళాభారతి, పటేల్ హాల్ ప్రదేశాల్లో సహాయక బృందాలకు కల్పించిన వసతులు, రక్షణ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు.


సహాయక సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

మన్యంకొండలో వైభవంగా వసంతోత్సవం


సుదర్శన పెరుమాళ్లకు చక్రస్నానం చేయిస్తున్న పురోహితులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, అవబృత స్నానం, నాకబలి (నాగవెల్లి), ద్వాదశరాధన, సప్తవరణులు, మహాదాశీర్వచనం చేశారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం నుంచి ఘాట్‌రోడ్డు గుండా గుట్టపై నున్న బావి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు పురోహితులు సంప్రదాయ రీతిలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను పూలతో శోభాయమానంగా అలంకరించి దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం వద్దకు తీసుకురావడంతో అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి విశేషోత్సవాల్లో పాల్గొని తరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవింద్, అలివేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


కోనేరులో త్రిశూల స్నానం చేయిస్తున్న పండితులు

అడ్డాకుల: మండలంలోని కందూరు సమీపంలో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం జరిపి.. స్వామివారి వెండి ముఖాన్ని పూలతో అలంకరించి పూజలు చేశారు. గౌరమ్మ ఆలయంలో గౌరమ్మ విగ్రహానికి చీర, పూలతో అలంకరించి పూజలు, రుద్రాభిషేకం, రుద్రహోమం తర్వాత మహాపూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయం ముందు ఊరేగించారు. కందూర్‌లో వసంతోత్సవం నిర్వహించిన తర్వాత గ్రామస్తులు ఆలయానికి చేరుకుని త్రిశూలస్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు. పవిత్రమైన కోనేరులో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ త్రిశూల స్నానం చేయించి ఉత్స వాలను ముగించారు. రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియగా.. సోమవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. ప్రతిఏటా ఉగాది పండగ వరకు జాతర కొనసాగనుండగా.. ఈ సారి శ్రీరామనవమి వరకు పొడిగించారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామస్తులు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన పోచమోని నర్సింహ (62) గ్రామ సమీపంలోని నాన్‌చెరువులో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడని ఎస్ఐ కె.రాణి తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నర్సింహ శనివారం రాత్రి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం చెరువులో వెతకగా మృతదేహం కనిపించింది. కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మృతదేహం లభ్యం

దేవరకద్ర: మండల కేంద్రంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైందని ఎస్ఐ నాగన్న తెలిపారు. 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని.. ఎడమవైపు చాతీపై అమ్మ అనే పచ్చబొట్టు ఉందని, భిక్షాటన చేసే వ్యక్తిగా కనిపిస్తున్నాడని చెప్పారు. మరిన్ని వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మొసలి దాడిలో వ్యక్తి..

గద్వాల క్రైం: మొసలి దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గద్వాల మండలంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రబీదాస్(21) మూడు నెలల క్రితం గుర్రంగడ్డ గ్రామంలోని కృష్ణా నది వంతెన పనుల కోసం వలస వచ్చాడు. ఈ నెల 14న హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలసి కృష్ణానది సమీపంలో మద్యం తాగాడు. అయితే అతడికి ఫోన్ రావడంతో స్నేహితులను వారు ఉంటున్న క్యాంపునకు వెళ్లాల్సింది చెప్పాడు. నదీతీర ప్రాంతంలో వెళ్లి మాట్లాడుతూ నీటిమడుగు వద్ద కూర్చున్నాడు. మడుగులో నుంచి ఆకస్మాత్తుగా మొసలి వచ్చి రబీదాస్‌ను నదిలోకి లాక్కెళ్లింది. అయితే స్నేహితుడు క్యాంపునకు రాకపోవడంతో వారు పరిసర ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం కృష్ణానదిలో రైతులకు మృతదేహం కనిపించింది. బయటకు తీసి పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి లవకుశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి మరొకరు..

మహబూబ్‌నగర్ క్రైం: స్నేహితులతో కలిసి హోలీ ఆడిన తర్వాత చెరువులో స్నానం కోసం వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతిచెందగా.. రెండు రోజుల తర్వాత మృతదేహం బయటపడింది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని వేపూరిగేరికి చెందిన మార్కొ అశోక్(38) ప్రింటింగ్ ప్రెస్‌లో రోజువారి వర్కర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే శుక్రవారం హోలీ ఆడిన తర్వాత సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం తాగి స్నానం చేయడానికి మండలంలోని వెంకటాపూర్ శివారులో ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో స్నానం చేయడానికి నీటిలోకి దూకిన అశోక్ నీట మునిగిపోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. అయితే మృతదేహం ఆదివారం ఉదయం బయటకు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై అశోక్ భార్య సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వివాహేతర సంబంధమే కారణం

హత్య వివరాలు వెల్లడించిన జడ్చర్ల సీఐ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కమలాకర్

జడ్చర్ల: వావివరసలు మరిచి అత్త అల్లుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. భర్త చూసి మందలించాడు. విషయం బయటకు తెలుస్తుందనే భయంతో ఆ ఇద్దరు కలిసి భర్తను హత్య చేసి ఆకస్మికంగా మరణంగా చిత్రీకరించారు. తన పెదనాన్న మరణంపై అనుమానం ఉందని తమ్ముడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఊపిరి ఆడకుండా చేయడంతోనే చనిపోయాడంటూ పోస్టుమార్టం రిపోర్టులో బయటపడటంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కమలాకర్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కావేరమ్మపేట శివారు రాజీవ్‌నగర్ కాలనీలో మీనుగ కోటయ్య, మీనుగ అలివేలు తమ ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే కాలనీలో ఉండే అల్లుడు వరుస అయ్యే మీనుగ రాజ్‌కుమార్‌తో అలివేలు వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా విషయం తెలిసిన భర్త కోటయ్య ఇద్దరిని మందలించాడు. ఈ ఏడాది జనవరి 23న రాత్రి మీనుగ కోటయ్య కులస్తులతో కలిసి షాద్‌నగర్‌లో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి రాగా అలివేలు, రాజ్‌కుమార్ కాలనీలోని తమ పాత ఇంట్లో కలిసి ఉండడాన్ని చూసి నిలదీశాడు. దీంతో విషయం అందరికి చెప్పి రచ్చ చేస్తాడని భావించిన నిందితులు మద్యం మత్తులో ఉన్న కోటయ్యను కింద పడేసి గొంతుకు చున్నీ బిగించి హత్య చేశారు. అనంతరం అక్కడే పడుకోబెట్టి ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు తన భర్త రాత్రి ఫంక్షన్‌కు వెళ్లి తిరిగిరాలేదంటూ అలివేలు పిల్లలను నిద్ర లేపి బంధువులు, చుట్టుపక్కల వారిని వెంటపెట్టుకొని పాత ఇంటికి వచ్చింది. చలనం లేకుండా పడి ఉన్న భర్తను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ పెద్దనాన్న మరణంపై అనుమానం ఉందని తమ్ముడి కుమారుడు మీనుగ నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా పోస్టుమార్టం రిపోర్టులో ఊపిరి ఆడకుండా చేయడంతోనే చనిపోయినట్లు బయటపడింది. ఆదివారం అలివేలును అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిదింతులు అలివేలు, రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

- ఆరుగురికి గాయాలు

అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వరం ఘాట్ రోడ్డులో ఆదివారం ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందగా ఆరుగురు గాయాల పాలైనట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి, నల్లగొండ జిల్లా డిండి, తెలకపల్లికి చెందిన 12 మంది ఆటోలో ఉమామహేశ్వరంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరిగి కొండ దిగుతుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తెలకపల్లికి చెందిన దొంతి తిరుపతయ్య (41) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అడ్డాకుల: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు చెందిన బాషా (32) టైల్స్ పని చేసేవాడు. శుక్రవారం నంద్యాల నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యంలో కందూర్ స్టేజీ వద్ద బ్రిడ్జిపై వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బా షాను స్థానికులు జిల్లాకేంద్రానికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు ఆస్పత్రికి త రలించగారు. అక్కడ చికిత్స పొందుతూ శనివా రం రాత్రి మృతి చెందాడు. బాషాకు భార్య రే ష్మా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఆదివారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వనపర్తిని క్రీడాహబ్‌గా మారుస్తాం

- త్వరలో రూ.7.50 కోట్లతో టర్ఫ్ మైదానం ఏర్పాటు
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తిటౌన్: క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని.. ఓటమిని ఆయుధంగా మలుచుకొని రెట్టింపు ఉత్సాహంతో గెలుపునకు ప్రయతి్నంచే వారే అసలైన క్రీడాకారులని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని డా. బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ క్రీడాపోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వనపర్తిని క్రీడా హబ్‌గా మారుస్తామని, జిల్లాకేంద్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రయత్నించాలన్నారు. త్వరలోనే రూ.7.50 కోట్లతో టర్ఫ్ మైదానం, ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే క్రీడాకారుల కోసం 50 గదులతో వసతిగృహాన్ని సైతం నిర్మిస్తామని చెప్పారు. అండర్–14 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికలు 20, బాలురు 20 జట్లు పాల్గొన్నాయి. బాలికల్లో నిజామాబాద్ జిల్లా మొదటి, అదిలాబాద్ జిల్లా రెండు, రంగారెడ్డి జిల్లా మూడోస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా మొదటి, మహబూబ్‌నగర్ జిల్లా రెండో, రంగారెడ్డి జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు జిల్లా క్రీడాశాఖ అధికారులు సుధీర్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదిత్య, లక్కాకుల సతీష్, క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.

పనిచేస్తూ కిందపడి వ్యక్తి మృతి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి వద్ద ఉన్న ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో పనిచేస్తున్న లింగంపేటకి చెందిన నర్సింహులు (48) ఆకస్మికంగా మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. ఎప్పటిలాగే ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు విధులకెళ్లాడు. అక్కడ పనిచేస్తూ ఆకస్మాత్తుగా కిందపడిపోవటంతో అదేగ్రామానికి చెందిన వ్యక్తులు ఏరియా ఆస్పత్రికి తరలిచగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య పరామర్శించారు. యూనివర్సిటీ నిర్వాహకులతో చర్చించగా ఆకుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. సాయంత్రం రూ.లక్ష నగదు ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

'పాలమూరు' కార్మికుడు..


కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు శివారులో కొనసాగుతున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులకు వచ్చిన కార్మికుడు వినోద్‌దాస్ (35) ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అస్సాంలోని మాదాపూర్‌కు చెందిన వినోద్‌దాస్ ఆదివారం మద్యం తాగి నడుస్తుండగా రాయి తగిలి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడని.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. భార్య దీపిక, కుమార్తె ఉన్నారని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలోని ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీటి తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగునీటి విషయంలో పాలమూరుకు ఎప్పుడు అన్యాయమే జరుగుతుందన్నారు. సాగునీటి పోరాటం తర్వాత ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ, బీసీ గణన వంటి పోరాటాలు తుది దశకు చేరుకోగా.. సాగునీటి పోరాటం మాత్రం ఇంకా కొనసాగుతుందన్నారు. నల్లగొండకు నాగార్జున సాగర్ నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి నీటిని తరలించడం అన్యాయం చేయడమేనన్నారు. ఏదుల రిజర్వాయర్‌కు ఒక టీఎంసీ మాత్రమే కేటాయించారని.. అందులో అర టీఎంసీ నీటిని డిండికి తరలించడం వల్ల ఉద్దండాపూర్, వట్టెం, కరివెన వరకు నీరు పారే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉద్యోగాలు, వ్యాపారాలు లేవని.. ఇప్పుడు నీళ్లు కూడా లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యతిరేకించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ విషయంపై ధర్నాలు చేసిన నాయకులు ప్రస్తుతం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా నుంచి ఏ ప్రాజెక్టు మొదలుపెట్టినా భూములు నష్టపోయేది ఈ ప్రాంత రైతులేనని అన్నారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–3 ఫలితాల్లో చాలా మంది విద్యార్థులు హాల్ టికెట్ నంబర్లు తప్పుగా వేసినందుకు వారిని పక్కన పెట్టారని.. మరోసారి పరిశీలించి మార్కుల ఆధారంగా ఫలితాలు విడుదల చేయాలన్నారు. సమావేశంలో టీడీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణయ్య, పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

'10 శాతం రిజర్వేషన్లు కల్పించడం దుర్మార్గం'


సమావేశానికి హాజరైన యాదవ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జనాభాలో కేవలం 15 శాతం ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం దుర్మార్గమని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకటయాదవ్ అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో యాదవ విద్యావంతుల వేదిక జిల్లాస్థాయి అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రకుల రిజర్వేషన్లు అతిపెద్ద తప్పిదమని, దీంతో బలహీనవర్గాలకు నష్టం జరుగుతుందన్నారు. సమాజంలో అణగారిన, బలహీన, పీడిత వర్గాలకు మాత్రమే సంఘాలు ఉండాలని, అలాంటిది పాలక పక్షంలో ఉన్న వ్యక్తులు కూడా సంఘాలను పెట్టుకొని వాళ్లకు అనుకూలమైన చట్టాలను రూపకల్పన చేసుకుంటున్నారని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎవరి వాటా వారికి దక్కాలని డిమాండ్ చేశారు. ప్రతి యాదవ బిడ్డ చదువుకోవాలని అందుకోసం వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. రాజకీయాల్లో యాదవుల వాటా కోసం ప్రతిఒక్కరు పోరాటం చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో రానున్న 15 రోజుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలుయాదవ్, నాయకులు రవికుమార్‌యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలుయాదవ్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ టు మక్కా షరీఫ్

రంజాన్‌లో ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లింలు



ఉమ్రాకు వెళ్తున్న యాత్రికుడిని సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేపడుతారు. ఈ మాసంలో నిర్వహించే ఆరాధనలకు దేవుడు 70 రెట్లు ఎక్కువ పుణ్యం ప్రసాదిస్తారని ముస్లింల నమ్మకం. ఏటా ఈ మాసంలోనే మక్కా, మదీనాలోని పుణ్య ప్రదేశాలైన కాబా ప్రదక్షిణ, మదీనాలోగల మసీదులోని ప్రార్థనల కోసం ముస్లింలు ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్నారు. ప్యాకేజీల వారీగా కొంత మంది 15 రోజులు, నెలరోజులపాటు మక్కా, మదీనాలోనే ఉంటారు. సాధారణ రోజుల్లో కంటే రంజాన్ మాసంలో ఉమ్రాయాత్రకు ఎక్కువ పుణ్యం దక్కుతుందని భావిస్తారు. అక్కడే రంజాన్ ఉపవాస దీక్షలు పాటిస్తూ దైవస్మరణలో తరిస్తారు.

వందల సంఖ్యలో..

కొన్నేళ్లుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పవిత్ర రంజాన్ మాసంలో ఉమ్రాయాత్రకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. మిగతా రోజుల్లో ఉమ్రాయాత్ర కంటే రంజాన్ మాసంలో ప్యాకేజీ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ముస్లింలు మక్కా, మదీనాకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి వందల సంఖ్యలో ఉమ్రాయాత్రకు వెళ్తున్నారు. దాదాపు 300 నుంచి 400 వరకు ఉమ్రాయాత్రకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతమంది మక్కా షరీఫ్ యాత్రకు వెళ్లారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో పదుల సంఖ్యలో హజ్, ఉమ్రా ట్రావెల్స్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది ఇక్కడి ట్రావెల్స్, మరికొంత మంది హైదరాబాద్‌లోని ట్రావెల్స్‌ల ద్వారా ఉమ్రాయాత్రకు వెళ్తున్నారు.

మానసిక ప్రశాంతత..



కొన్నేళ్ల నుంచి రంజాన్ మాసంలో ఉమ్రాయాత్ర చేస్తున్న. ఉమ్రాయాత్రతో మనస్సుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది. ఈ రంజాన్ మాసంలో 15 రోజులు మక్కా, మదీనా షరీఫ్‌లో దైవ ప్రార్థనలో నిమగ్నమై ఈ నెల 10న ఇంటికి వచ్చాను. ఆ అల్లా దయవల్లే ప్రతి ఏడాది రంజాన్‌లో ఉమ్రాయాత్ర చేయడానికి అవకాశం లభిస్తుంది.

– అబ్దుల్ జకీ, ఉమ్రా యాత్రికుడు, మహబూబ్‌నగర్

అదృష్టంగా భావిస్తున్నా..



ఇప్పటి వరకు రెండుసార్లు ఉమ్రాయాత్ర చేశాను. 2018 సంవత్సరంలో పవిత్ర రంజాన్ మాసంలో ఉమ్రాయాత్రకు వెళ్లాను. రంజాన్‌లో ఉమ్రాయాత్ర చేయడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ముస్లింలు రంజాన్‌లో ఉమ్రాయాత్ర చేయడానికి వెళ్తున్నారు.

– మొహసిన్‌పాష ఖాద్రీ, మహబూబ్‌నగర్